క్లుప్తంగా

మెస్‌లను తనిఖీ చేసిన రెక్టార్


విద్యార్థులతో మాట్లాడుతున్న రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ హాస్టల్ మెస్‌లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి ప్రతి రోజు అందిస్తున్న అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని అక్కడి సిబ్బందికి, అధికారులకు సూచించారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గోవింద్

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలో పినాకిల్ గ్రౌండ్ ఆటో స్టాండ్‌లో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో యూనియన్ పటిష్టంగా ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు నిత్యం కలిసికట్టుగా ఉండాలని సూచించారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆటోలు నడపాలన్నారు. గురువారం సీతమ్మధారలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జరగనున్న ఏఐటీయూసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆరిలోవ జోన్ అధ్యక్షుడు పిల్లి వీర్రాజు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ లేబొరేటరీ పరిశీలన

మహారాణిపేట: ఆంధ్రా యూనివర్సిటీలోని ఎక్సైజ్ శాఖ లేబొరేటరీని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం సందర్శించారు. కొత్తగా ఏర్పాటు చేసిన లేబొరేటరీలో ఉన్న అత్యాధునిక పరీక్షా విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ క్రోమోటో గ్రఫీ తదితర యంత్రాల పనితీరును తెలుసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మద్యాన్ని తొమ్మిది రకాలుగా పరీక్షిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. మద్యంలో ఉన్న ముడి పదార్థాలను ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకునేలా ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు అందించే మద్యం గురించి ఎలాంటి అపోహలు లేకుండా చేసేందుకే ఈ ల్యాబ్ ఏర్పాటు చేశామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.


పగలే విద్యుత్ వెలుగులతో బస్టాప్


తుప్పు పట్టిన ఆర్.కె బీచ్ బస్టాప్‌లోని పరికరాలు

- పట్టపగలే విద్యుత్ వెలుగులు
- పచ్చదనం హరి
- ఆకతాయిల చేష్టలతో కళావిహీనం

బస్ బే..
అడుగడుగునా నిర్లక్ష్యమే..!

ఏయూక్యాంపస్: స్మార్ట్ సిటీ బస్టాప్ కళావిహీనంగా తయారవుతోంది. పారిశుధ్య సిబ్బంది, హార్టికల్చరల్ విభాగాలు దృష్టిసారించి దీనికి పూర్వవైభవం తీసుకురావాలి. స్మార్ట్ సిటీలో భాగంగా జీవీఎంసీ 19.5 లక్షల రూపాయల వ్యయంతో సిరిపురం నుంచి చినవాల్తేరుకు వెళ్లే మార్గంలో ఏయూ ఇన్‌గేట్ వద్ద బస్‌స్టాప్‌ను ఆధునికీకరించింది. బస్‌స్టాప్‌కు ఆధునిక సొబగులు అద్దడంతో పాటు, చుట్టూ గ్రీనరీని అభివృద్ధి చేశారు. భారీ కుండీలను ఏర్పాటు చేసి వాటిలో అలంకరణ మొక్కలను నాటారు. గతేడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ బస్టాప్ విశేషంగా నగరవాసులతో పాటు పర్యాటకులను సైతం ఆకట్టుకుంది. తరువాత కాలంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్వహణపై అంతగా దృష్టి సారించడం లేదు.

పగలే వెలుగులు...

రాత్రివేళల్లో ఎంతో ఆకర్షణీయంగా ఉండేలా ఈ బస్టాప్‌ను విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. ఉదయం వేళలో సైతం విద్యుత్ దీపాలు వెలుగుతూ విద్యుత్‌ను, ప్రజాధనాన్ని వృథా చేస్తున్నాయి. సిబ్బంది కాలానుగుణంగా వీటిని ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

పచ్చదనం స్థానంలో పిచ్చిమొక్కలు

బస్ స్టాప్ చుట్టూ ప్రత్యేకంగా పచ్చదనం అభివృద్ధి చేయడానికి నాటి అధికారులు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఇక్కడ మొక్కలు నాటి పెంచడానికి ప్రత్యేకమైన స్థలాన్ని అభివృద్ధి చేశారు. ప్రారంభోత్సవ సమయంలో అందమైన పూలమొక్కలను ఇక్కడ నాటారు. తరువాత నిర్వహణ పట్టించుకోవడం మానేశారు. దీంతో బస్టాప్ చుట్టూ ఉన్న మొక్కలు ఇప్పుడు కానరావడం లేదు. పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయాయి.

నిరుపయోగంగా కుండీలు

బస్‌స్టాప్‌ను ఆధునికీకరిస్తూ మొక్కల కుండీలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటిలో మొక్కలు లేకపోగా వ్యర్థాలతో వెక్కిరిస్తున్నాయి. వీటిని సంరక్షించడంతో పాటు వీటిలో పశువులు తినని అలంకరణ మొక్కలను నాటితే ఎంతో ఆహ్లాదాన్ని పంచే అవకాశం ఉంది.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

బస్టాప్ ముందు భాగాన్ని శుభ్రం చేయడానికి సిబ్బంది ఆసక్తి చూపుతున్నా వెనుక భాగాన్ని విస్మరిస్తున్నారు. దీంతో బస్‌స్టాప్‌ని అనుకుని ఉన్న చెట్ల నుంచి రాలే ఆకులు ఇక్కడ పేరుకుపోతున్నాయి. వర్షం తోడవడంతో ఇవి కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. పారిశుధ్య విభాగం సిబ్బంది వీటిని శుభ్రం చేయడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


ఆకతాయి చేష్టలతో అపహాస్యం

ఆకతాయిలు చేస్తున్న చర్యలతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నగరానికి పేరుతెచ్చే ఇటువంటి బస్‌స్టాప్‌లు అపహాస్యం పాలవుతున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన కొన్ని పోస్టర్లను ఆకతాయిలు చించి వేస్తున్నారు. వీటిని మార్చలేక తాత్కాలికంగా స్టిక్కర్ అతికించారు. అదే విధంగా కొంత మంది ఇక్కడ ఉన్న రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం చుట్టూ తమ చేతి ముద్రలు వేశారు. బస్టాప్ గోడలపై కరపత్రాలు అతికించడం, ఆకతాయిలు రంగులతో కూడిన తమ చేతి ముద్రలు వేస్తూ కళావిహీనంగా తయారు చేస్తున్నారు.

ఆర్కే బీచ్ వద్ద అదే పరిస్థితి

బీచ్‌రోడ్డులో ఆర్.కె బీచ్ వద్ద నిర్మించిన స్మార్ట్ సిటీ బస్‌స్టాప్ నిర్వహణ అంతంత మాత్రంగా ఉండడంతో పరికరాలు తుప్పు పట్టాయి. ఇనుప స్తంభాలు తుప్పు పట్టాయి. వీటికి రంగులు కూడా వెలిసిపోయాయి. అదే విధంగా బస్ స్టాప్‌ను అనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల స్తంభాలు సైతం కళావిహీనంగా తయారై, తుప్పు పడుతున్నాయి. వీటికి సైతం రంగులు వేయాల్సిన అవసరం ఉంది.


తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం


గోడలపై అతికించిన పోస్టర్లపై చేతి ముద్రలు


వెనుక భాగంలో పేరుకుపోతున్న చెత్త


పచ్చదనం కనుమరుగై పిచ్చిమొక్కలతో నిండి


విలువైన కుండీలలో కనిపించని మొక్కలు

సోరియాసిస్ అంటువ్యాధి కాదు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

ఏయూక్యాంపస్: సోరియాసిస్ అంటు వ్యాధి కాదని, దీనిపై ప్రజల్లో అవగాహన ఉండాలని వైద్యులు సూచించారు. ప్రపంచ సోరియాసిస్ డేని పురస్కరించుకుని నార్త్ ఆంధ్ర అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వేరినియాలజిస్ట్, లెప్రోలాజిస్ట్ ఆధ్వర్యంలో ఆర్.కె బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటాచలం మాట్లాడుతూ ఈ సంవత్సరం 'సోరియాటిక్ వ్యాధి –కుటుంబం అనే నినాదంతో' దీనిని జరుపుతున్నామన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించడం సరైన చికిత్సను అందించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ దివ్య, కోశాధికారి డాక్టర్ ఎం.దివ్య, సమన్వయకర్తలు డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ నారాయణ రావు, డాక్టర్ గురు ప్రసాద్, డాక్టర్ రఘు రామా రావు, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పీవీ సింధు స్థలంలో టీడీపీ ఆందోళన


ధర్నా చేస్తున్న టీడీపీ, వామపక్షాల నాయకులు

ఆరిలోవ: గత ప్రభుత్వం ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో జూనియర్ కళాశాల నిర్మించాలంటూ టీడీపీ నేతల ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళనకు దిగారు. తోటగరువు జెడ్పీ హైస్కూల్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని గత ప్రభుత్వం పీవీ సింధుకు కేటాయించింది. ఆ స్థలంలో మంగళవారం టీడీపీ మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానికులు ధర్నాకు దిగారు. స్థలంలో అకాడమీ కోసం జరుపుతున్న పనుల్ని అడ్డుకున్నారు. యంత్రాలను వెనక్కి పంపించేశారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ పీవీ సింధుకు వేరే చోట స్థలం కేటాయించి, ఆరిలోవ ప్రాంత విద్యార్థుల కోసం ఈ స్థలంలో జూనియర్ కళాశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో జూనియర్ కళాశాల కోసం చాన్నాళ్ల నుంచి ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఆందోళనలో స్థానికులతో పాటు పలువురు టీడీపీ, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా దీపావళి చేసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో ఏయూ విద్యా విభాగాధిపతి షారోన్ రాజు

విశాఖ సిటీ: పర్యావరణహితంగా దీపావళి చేసుకోవాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి టి. షారోన్ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఏయూ ఆర్ట్స్ కళాశాల వద్ద 'గ్రీన్ దివాళీ–సేవ్ ఎన్విరాన్మెంట్' నినాదంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపావళి పేరుతో టపాసులు కాల్చడం కారణంగా వెలువడే పొగతో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. భారీ శబ్దాలను వెలువరించే టపాసులతో శబ్ద కాలుష్యం పెరుగుతుందని వివరించారు. భారతీయ సంస్కృతిలో దీపానికి ఎంతో గౌరవం, ప్రత్యేకత ఉందన్నారు. ఇంటిని దీపాలతో అలంకరించి బంధు మిత్రులతో కలిసి ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ సాల్మన్, డాక్టర్ హేమలత, డాక్టర్ వినీలకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్కును సందర్శించిన విద్యార్థులు


బయో డైవర్సిటీ పార్క్‌లో విద్యార్థులు

బీచ్‌రోడ్డు: బొబ్బిలి ప్రాంతానికి చెందిన శ్రీ షిర్డీ సాయి డిగ్రీ కాలేజ్ బోటనీ విద్యార్థులు పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను మంగళవారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకట రమణ వివిధ మొక్కలు గుణాలను వివరించారు.

బ్రెయిన్ స్ట్రోక్ వస్తే సకాలంలో వైద్యులను సంప్రదించాలి

ఆరిలోవ: బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినవారు గోల్డెన్ అవర్స్‌గా పిలవబడే మూడు గంటలలోపు వైద్యులను సంప్రదించాలని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే సందర్భంగా విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో మంగళవారం న్యూరో విభాగంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విమ్స్ వైద్యులు సుమారు 80 మంది రోగులకు బ్రెయిన్ స్ట్రోక్, మూర్ఛ వ్యాధికి సంబంధించిన పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినవారికి గోల్డెన్ అవర్స్‌లోనే వైద్యం అందించాలన్నారు. అలాంటివారు తొందరగా కోలుకోవడంతో పాటు వారికి ప్రాణాపాయం తప్పుతుందన్నారు. దీనికి సంబంధించి రూ.వేలు విలువ చేసే ఇంజక్షన్లు విమ్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఇంజక్షన్ ద్వారా బ్రెయిన్ స్ట్రోక్ నుంచి తొందరగా కోలుకోవచ్చన్నారు. స్ట్రోక్ వచ్చినవారు మూతి వంకర తిరగడం, చేతులు బలహీనపడటం, మాట్లాడలేకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాంటి సమయంలో వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో విమ్స్ న్యూరో విభాగం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


విమ్స్‌లో ఉచిత న్యూరో వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బీచ్‌రోడ్డులో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు


ప్రతిజ్ఞ చేస్తున్న సీబీఐ సిబ్బంది

ఏయూక్యాంపస్: విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఆర్కే బీచ్ వద్ద సీబీఐ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్.పి మురళీ లాంబ విచ్చేసి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లకార్డులు చేతబూని అవినీతికి దూరంగా ఉండాలని, అవినీతిని ప్రోత్సహించరాదని, అవినీతిని నిర్మూలించాలని నినాదాలు చేశారు. అనంతరం బీచ్‌రోడ్డులో కరపత్రాలను పంపిణీ చేశారు. ఓరియంటల్ ఇన్సూరెన్స్ సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ జరిపారు. ర్యాలీలో సంస్థ డీజీఎం కె.కోటేశ్వర రావు, ఆర్ఎం పి.సతీష్ బాబు, టి.టి.వి రామం, మేనేజర్ ఎన్.రామానుజన్, విజిలెన్స్ అధికారి ఎస్.ఎస్.కె మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులు కూటమి నేతలే..!

- ఎమ్మెల్యే వెలగపూడికి దారపాలెంవాసుల ఫిర్యాదు
- ప్రభుత్వ స్థలాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే


దారపాలెంలో హెవీ విద్యుత్ లైన్ దిగువున చదును చేసిన స్థలం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని దారపాలెంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కూటమి నేతలే ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే వెలగపూడికి ఫిర్యాదు చేశారు. దీంతో స్థానికులు సమాధానం చెప్పడానికి ఇబ్బంది పడ్డారు. దారపాలెంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తున్న వివరాలను స్థానికుల నుంచి తెలుసుకున్నారు. ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన హెవీ విద్యుత్ లైన్ కింద స్థలాలను కొందరు ఆక్రమించి విక్రయిస్తున్నారని తెలుసుకొన్నారు. ఆ స్థలం ప్రభుత్వానిదా, లేదా ప్రవేట్ వ్యక్తులకు సంబంధించిందా సర్వేచేసి పూర్తి వివరాలు తెలియజేయాలని చినగదిలి వీఆర్వో సత్యం దొరను ఆదేశించినట్టు తెలిసింది. దీంతో పాటు దారపాలెంలో అటు సింహాచలం దేవస్థానం భూములను ఆనుకొని ఉన్న రెవెన్యూ స్థలాలు, ఇటు కంబాలకొండ అంచున ఉన్న రెవెన్యూకి చెందిన స్థలాల వివరాలు తెలియజేయాలని ఆదేశించినట్టు సమాచారం.

ఆనందాల కేళి..దీపావళి









మద్దిలపాలెం: ముందస్తు దివాళీ సంబరాలు అంబరాన్ని తాకాయి. సదరన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం సంప్రదాయబద్ధంగా సంబరాలు నిర్వహించారు. రంగురంగు ముగ్గులు..ఘుమఘుమలాడే పిండివంటలు..సంప్రదాయ వస్త్ర ధారణలో విద్యార్థులు పండగ కళను తీసుకొచ్చారు. వేడుకకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరయ్యారు. విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

• బీచ్ రోడ్డులో స్వచ్ఛభారత్



బీచ్ రోడ్డులో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆదాయ పన్ను శాఖ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాక్ నిర్వహించి స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. అనంతరం బీచ్‌లోని వ్యర్థాలను తొలగించారు. -ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బీసీల సమస్యలను పరిష్కరించాలి

బీచ్‌రోడ్డు: బీసీ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా అన్యాయం జరుగుతున్న తరుణంలో ఆ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కోరారు. ఈ మేరకు నగరానికి వచ్చిన మంత్రికి బీసీ సమస్యలపైన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జనగణనతో పాటు బీసీ కుల గణన కూడా దేశ వ్యాప్తంగా నిర్వహించాలని ,బీసీలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. బీసీలకు 100 శాతం సబ్సిడీతో రుణాలు కల్పించాలన్నారు. తాడిపూడి జలాశయానికి బీసీ ఉద్యమ నేత కీర్తిశేషులు గొర్రపాటి బుచ్చి అప్పారావు పేరును యథావిధంగా కొనసాగించాలన్నారు.


మధురవాడలోని ఫ్యూచర్ ఆన్-24 పేరుతో నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ ఫేర్‌లో సీనియర్స్ ఆర్ట్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీకృష్ణాపురం విద్యార్థులు కార్తీక్, బాలు రూపొందించిన ఆర్ట్ గ్యాలరీ